క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్సీ 'తోట'



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన త్రిమూర్తులుకు ఆలయ వేద పండితులు స్వామివారి విశిష్టతను వివరించారు. అనంతరం త్రిమూర్తులను ఆలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి, చిత్రపటం ప్రసాదం అందజేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 వేల విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన బి.అమరేశ్వర్–దివ్య దంపతులు రూ.10,001 విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ అర్చకుల చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

సర్వే సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో మంచినీటి చెరువు మధ్యగా ఇచ్చిన రైల్వే లైను అలైన్‌మెంట్‌ను మార్చవలసిందిగా డిమాండ్ చేస్తూ సదరు గ్రామస్తులు సర్వే డిపార్ట్‌మెంట్ సిబ్బందిని శుక్రవారం అడ్డుకున్నారు. ఇందుకు నిరసన తెలుపుతూ కూడా వారు ప్రదర్శన నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధులు కలగిత ఏసురత్నం, బత్తుల ప్రసాద్, పి.రంగరాజు, చిట్టిబాబు, ముత్యాల శ్రీనివాసరావు, కంకటాల శ్రీనివాస్, కొణిదెల అన్నవరం, కె.చిట్టిబాబు, కె.నరేష్, సీహెచ్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ఉదయకృష్ణ మృతి తీరని లోటు



ఉదయకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అంబాజీపేట: ఎమ్మార్పీఎస్ నాయకుడు తొత్తరమూడి ఉదయకృష్ణ అకాల మృతి తీరని లోటని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. అంబాజీపేటలో ఉదయకృష్ణ పార్థివ దేహం వద్ద శుక్రవారం నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. చేసిన సేవలు ఎనలేనివని ఇజ్రాయిల్ చెప్పారు. ఉదయకృష్ణ మృతికి ఉందుర్తి ఆనందబాబు, కొల్లి సూర్యారావు, ఉందుర్తి నాగబాబు, తెన్నేటి కిషోర్, నేదునూరి వీర్రాజు, యార్లగడ్డ సత్తిబాబు, పెదపూడి శ్రీనివాస్, మంద రాజేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న వృద్ధులతో యోగా ఆశ్రమం సభ్యులు

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం సభ్యులు శుక్రవారం మండలంలోని ఊబలంక సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటింటికీ భోజనం క్యారేజీలు అందించే నిత్య అన్నదాన కేంద్రం వద్ద వృద్ధులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బండారు సంజీవ్, బండారు సందీప్ సహకారంతో 155 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త మన్యం పర్వత వర్ధనరావు, గ్రామ పెద్దలు మల్లిడి చిట్టిరెడ్డి, స్వామి వివేకానంద యోగా ఆశ్రమం అధ్యక్షుడు గునిశెట్టి నాగేంద్ర, యోగా సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించి ఇంటి పట్టా అందజేత

సఖినేటిపల్లి: మండలంలోని గుడిమూలలో శుక్రవారం నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు నల్లి రమాబాయికి ఇంటి పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో వేగిరాజు వెంకట రామరాజు, తహసీల్దార్ చేసిన సూచనలతో ఈ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. పై పట్టాను గ్రామ సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు చేతుల మీదుగా ఆమెకు పంచాయతీ వద్ద అందజేశారు. పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- అంకంపాలెంలో రూ.3 కోట్లతో సబ్‌స్టేషన్ ప్రారంభం



అంకంపాలెంలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



అంకంపాలెంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ప్రతి పల్లెకూ నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం నవరత్నాల్లో భాగంగా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఉండేదని కనీసం రోజుకు 5 గంటలు కూడా విద్యుత్ సరఫరా ఉండేది కాదన్నారు. గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ప్రభుత్వాన్ని పల్లె సీమలకు దగ్గర చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రభంజనం సృష్టించిన సీఎం జగన్ పల్లెలకు పూర్తి స్థాయి వెలుగులు నింపేందుకు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లను నెలకొల్పేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో పరిసర ప్రాంతాల్లో నాలుగు గ్రామాలకు నాణ్యమైన పూర్తి స్థాయి విద్యుత్ అందించేందుకు రూ.3 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. గతంలో తన హయాంలో వసంతవాడలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశానని ప్రజలకు గుర్తు చేశారు. విద్యుత్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ముఖ్యంగా రైతులకు అందించే విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం సబ్‌స్టేషన్ నిర్మాణానికి సహకరించిన సీనియర్ పార్టీ నాయకులు గారపాటి అబ్బులుచౌదరి, గంగారామ్‌చౌదరి, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీలు బోణం సాయిబాబా, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, సీనియర్ పార్టీ నాయకులు కొల్లి శ్యాంసన్, పాలా నాగేశ్వరరావు, కరుటూరి శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

68 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

అర్హత ఉన్న ప్రతి ఆడపడుచుకి ఇంటి స్థలం అందిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని అంకంపాలెంలో సీనియర్ వైఎస్సార్ సీపీ నేత గారపాటి అబ్బులు చౌదరి, గంగారామ్‌చౌదరి ఆధ్వర్యంలో 68 మంది లబ్ధిదారులైన ఆడపడుచులకు పసుపు, కుంకుమ, రవికలతో పుట్టింటి కానుకవలే ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ రాష్ట్రంలో సొంత ఇళ్లు లేని వారు ఎవరూ ఉండకూడదనే దృఢ సంకల్పంతో 30 లక్షలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందజేశారని, కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 17 వేల మంది పైనే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సమయం వచ్చినప్పుడు ప్రజలు కూడా గుర్తుపెట్టుకుని బటన్ నొక్కి వారి అభిమానాన్ని చూపించాలన్నారు. అలాగే గ్రామసచివాలయ పరిధిలోని అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ స్టోరేజ్ భవనాన్ని ప్రారంభించారు. రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

జామియా మసీదు కమిటీ నూతన కార్యవర్గం

మామిడికుదురు: నగరం సున్నీ జామియా మసీదు నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ ఆవరణలో జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా హాజీ మసూద్ మొహిద్దీన్, ఉపాధ్యక్షుడిగా నూరుద్దీన్ అహ్మద్, కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ కలామ్, కోశాధికారి అహ్మద్ అమీషా, సభ్యులుగా షేక్ మసూద్, షేక్ గౌస్ మొహిద్దీన్, ఎండీవై షరీఫ్, షేక్ గౌస్, అబ్దుల్ మునీర్, మహ్మద్ సుల్తాన్, షేక్ అబ్దుల్ నజీర్, మొహ్మద్ మొహిద్దిన్, షేక్ కరీముల్లాలు ఎన్నికయ్యారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో విష జ్వరాలు సోకే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ చెప్పారు. నందంపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను అరికట్టవచ్చన్నారు. అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



కె.ఏనుగుపల్లిలో ఆర్‌బీకే భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కె.ఏనుగుపల్లిలో రూ.20.8 లక్షలతో నిర్మించిన వెల్నెస్, రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే సెంటర్ భవనాలను చిట్టిబాబు, విప్పర్తి శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ తోలేటి బంగారు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రజలంతా సహకరించాలని అన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువగా తీసుకువచ్చిన ఘనత జగన్‌దేనని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి దుర్గారావు, సూదా వీరభద్రరావు, గంధం ఏసు, శేరు సత్యనారాయణ, యల్లమెల్లి సత్యనారాయణ, సూదా శ్రీను, పుచ్చకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



వివరాలు వెల్లడించి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రగతి భారతం ట్రస్ట్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సభ్యులు

రావులపాలెం: ప్రగతి భారతం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్కు వద్ద నిర్వహించనున్న హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ట్రస్ట్ చైర్మన్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఇతర సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను రామకృష్ణారెడ్డి వెల్లడించారు. జనవరి 22న అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ వైభవంగా జరిగిన విషయం తెలిసిందేనన్నారు. మొత్తం కార్యక్రమంలో అత్యంత విశిష్టత కలిగినది యంత్ర ప్రతిష్ఠ అన్నారు. ఏ దేవాలయానికైనా దేవతా విగ్రహం కింద ఒక యంత్రాన్ని నిర్మిస్తారని, అటువంటి గొప్ప అవకాశం భారతదేశ వ్యాప్తంగా ఎన్నో లక్షల మంది పండితులు ఉండగా మన ఆంధ్ర వాసి అయిన బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబరశాస్త్రికి ఆ అవకాశం లభించిందన్నారు. శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు ఆ అవకాశాన్ని వారికి ఇచ్చారన్నారు. ఆ యంత్రాన్ని బాలరాముని విగ్రహం కింద ప్రతిష్ఠించారన్నారు. అటువంటి మహనీయులైన చిదంబరశాస్త్రికి ఈనెల 4న ప్రగతి భారతమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానం చేయడంతో పాటు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే బాలరామ లీలలు అనే విషయంపై ప్రసంగం కూడా ఉంటుందని భక్తులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు.

పథకాలు పేదలకు అందేలా సమన్వయంతో పని చేయాలి



మలికిపురం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు పూర్తి స్థాయిలో అందేలా సమన్వయంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే రాపాక ముఖ్య అతిథిగా మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారం నిమిత్తం రెండు విద్యుత్ బృందాలు పర్యటిస్తున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో ఆ శాఖకు సంబంధించిన సమస్యలు, ఇతర లోవోల్టేజీ సమస్యలు, స్తంభాల మార్పునకు, అదనపు స్తంభాలు ఏర్పాటు వంటి వాటి గురించి బృందం సభ్యులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంప్రదించాలని ఆయన సూచించారు. మండలంలో ప్రధాన రహదారులన్నీ ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిని ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు రివ్యూ చేశారు. వరి సాగులో రైతులను ఆదుకునేందుకు రాయితీపై ఎరువులు, పురుగు మందుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని, లక్కవరం పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు కోరారు. రామరాజులంకలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కాకర శ్రీనివాస్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పంటకాలువల్లో పూడిక, గుర్రపుడెక్క, తూటు వల్ల సాగునీటి సరఫరాకు ఆటంకంగా ఉంటోందని విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా సభ దృష్టికి తెచ్చారు. హౌసింగ్ శాఖకు సంబంధించి పురోగతి గురించి ఏఈ ఎ.సత్యనారాయణ వివరించారు. ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రైతులకు చేయూతనిచ్చే పనుల గురించి ఆ శాఖ అధికారి వివరించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేగా రాపాక 5 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ తోటె రాజేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ బళ్ళ ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ కందికట్ల నిర్మలకుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చోరీ అయిన హుండీ సొమ్ము తిరిగి ప్రత్యక్షం



గొలకోటివారిపాలెం పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పళ్లెంలో నగదు

కొత్తపేట: దొంగిలించబడిన ఆలయంలో హుండీ సొమ్ము మళ్లీ ప్రత్యక్షమైన వైనమిది. మండలంలోని మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం నిత్యపూజలతో అలరారుతుంది. ఆలయ నిర్మాణ కర్త గొలకోటి మాధవరావు (మాధవ్) ఆధ్వర్యంలో వార్షికోత్సవం, హనుమత్‌జయంతి, శ్రీరామనవమి వంటి వివిధ పర్వదినాల్లో స్వామికి విశేష పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. స్థానికులే కాక ఇతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుంటారు. మ్యారేజ్ సెట్టింగ్స్ ఏర్పాటు చేసే మాధవ్ సెట్టింగ్స్ కోసం గత నెల 28న నాగపూర్ వెళ్లగా 30 రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు స్వామివారి హుండీ పగులకొట్టి దానిలో సొమ్ము దొంగిలించుకుపోయారు. 31 ఉదయం మాధవ్ తిరిగి రాగా స్థానికులు హుండీ సొమ్ము దొంగిలించిన విషయాన్ని తెలిపారు. వాళ్ల సంగతి స్వామి చూసుకుంటారులే అని మాధవ్ స్వామివారికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు జరిపించారు. ఇదిలా ఉండగా ప్రతిరోజు మాదిరిగా శుక్రవారం ఉదయం మాధవ్‌తో పాటు స్థానిక భక్తులు పలువురు ఆలయ ప్రాంగణం శుభ్రపరచి, ధూప, దీప నైవేద్యాలు పెట్టేందుకు వెళ్లగా స్వామివారి విగ్రహం ముందు ఉన్న పళ్లెంలో 500, 200, 100, 20, 10 నోట్లు మొత్తం రూ.7,630తో పాటు కొత్త తాళం కప్ప ఉన్నాయి. వాటిని చూసి వారు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇంతవరకూ ఆలయాల హుండీలు పగులకొట్టి వాటిలో సొమ్ము దొంగిలించడమే గాని తిరిగి పట్టుకొచ్చిపెట్టిన దాఖలాలు లేవని ఇది ఈ స్వామివారి లీల అని పేర్కొన్నారు.

పురోహితుల క్రికెట్ టోర్నీ విజేత కాకినాడ



విజేతగా నిలిచిన కాకినాడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే విష్ణు

అంబాజీపేట: సమాజం హితం కోరుకుంటూ మంచి గుర్తింపుతో నిత్యం వేదపఠనం, పూజలతో తలమునకలై ఉండే పురోహితుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ టోర్నీలో కొవ్వూరు, కాకినాడ మధ్య జరిగిన హోరాహోరి పోటీలో 8 పరుగుల తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించి విజేతగా నిలవగా, కొవ్వూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. ఉపద్రష్ట విజయ్ అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి విశ్వరూప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణులు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో కూడా పురోహితుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించే విధంగా సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. అనంతరం జరిగిన సభలో కాకినాడ జట్టును విన్నర్‌గా ప్రకటించి రూ.50 వేలు చెక్ ట్రోఫీని అందించగా, కొవ్వూరు జట్టుకు రన్నర్స్ కప్, రూ.30 వేలు అందజేశారు. అలాగే సెమీఫైనల్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు రూ.పదివేలు నగదును ట్రోఫీని అందజేశారు. పోటీల్లో ఉభయ రాష్ట్రాల నుంచి 300 మంది పురోహిత క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పి.రఘురామ్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, రాష్ట్ర పురోహిత సంఘం గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, స్థానిక నాయకులు గణపతి వీరరాఘవులు, దాసరి వీవీ సత్యనారాయణ, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో ఉచిత వైద్య పరీక్షలు



మాకనపాలెం వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి

మామిడికుదురు: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. మాకనపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం జరిగింది. లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యం ఆధ్వర్యంలో సుమారు 150 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ కె.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వలవల పెదబాబు, సర్పంచ్ మద్దాల బాబూరావు శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధికారులకు ఘన వీడ్కోలు



కొత్తపేటలో బదిలీ అయిన ఆర్డీవో, తహసీల్దార్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు



ఆలమూరులో తహసీల్దార్ శెట్టిని సత్కరిస్తున్న మండల బీసీ ఉద్యోగుల సమాఖ్య

కొత్తపేట: స్థానిక ఆర్డీవోగా ముక్కంటి, తహసీల్దార్‌గా కిషోర్‌బాబు అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేసి ఏలూరు బదిలీ అయిన ఎం.ముక్కంటి, తహసీల్దార్‌గా పనిచేసి విజయవాడ వెస్ట్ మండలానికి బదిలీ అయిన జీడీ కిశోర్‌బాబు వీడ్కోలు సన్మానం ఎంపీపీ గంగాధరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మార్గన మాట్లాడుతూ ఆర్డీవో ముక్కంటి, తహసీల్దార్ కిషోర్‌బాబు అందించిన సేవలను కొనియాడారు. వారిరువురికి శాలువాలు, పూలమాలలు, మెమెంటోలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ శెట్టికి ఘన సత్కారం

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై వెళ్లిపోతున్న తహసీల్దార్ ఐపీ శెట్టికి శుక్రవారం ఘన సత్కారం జరిగింది. మండల బీసీ ఉద్యోగుల సమాఖ్య, మండల వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ, బీసీ ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ శెట్టిని సత్కరించారు. శాలువ కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికను బహూకరించారు, జిల్లా బీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, సీహెచ్ వెంకటేశ్వరరావు, వైవీవీ రమణ, దార్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఠాగూర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తహసీల్దార్ ఠాగూర్‌కు సత్కారం

పి.గన్నవరం: కృష్ణా జిల్లా నందిగామకు బదిలీ అయిన పి.గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఘనంగా సత్కరించారు. విధి నిర్వాహణలో ఠాగూర్ అందించిన సేవలను అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై హర్షం

రాజోలు: లోటఓల్టేజీ సమస్యను నివారించేందుకు రాజోలులోని కొత్త పోస్టాఫీసు వీధికి 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో లోఓల్టేజీ సమస్యపై స్థానికులు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే రాపాక ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇటీవల ఇదే ప్రాంతానికి రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నమోదు ప్రక్రియ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అయినవిల్లి: మండలంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను జిల్లా జేసీ నూపుర్ అజయ్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆమె అయినవిల్లిలో పర్యటించి పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈనెల 15లోపు పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి వై.శోభ, గ్రామ స్థాయి సిబ్బంది ఉన్నారు.

సాంకేతికతతో సులభరీతిలో విద్యాబోధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ హరిప్రసాద్

కొత్తపేట: సాంకేతికతను ఉపయోగించడం ద్వారా పాఠశాలల్లో సులభరీతిలో విద్యాబోధనతో పాటు అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులకు సర్వశిక్షా అభియాన్ ద్వారా ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), సిములైజేషన్ అంశాలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ హరిప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లోనూ సాంకేతికత ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఐఎఫ్‌బీ ప్యానల్స్ ఉపయోగించుకుని గణితంలో విద్యార్థుల భయాన్ని సులభంగా తొలగించవచ్చని అన్నారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్, గణిత అవధాని టీవీవీఎస్ సూర్యనారాయణమూర్తి, జిల్లా రిసోర్స్‌పర్సన్ ఆదివారపుపేట వెంకటేశ్వరరావు, ఆర్‌వీవీ సత్యనారాయణ, ఎం.మాణిక్యాలరావు, కె.కృష్ణమూర్తి వివిధ సిములైజేషన్లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడువుకు ముందే వంతెన నిర్మాణం పూర్తి



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలు నాయక్

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ఠ నదీపాయపై రూ.49.5 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులను గడువులోగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలునాయక్ తెలిపారు. యుద్ధప్రాతిపదికన జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. గతంలో వరద బాధితుల పరామర్శకు వచ్చిన సీఎం జగన్‌ను ఇక్కడ వంతెన నిర్మించాలని లంక గ్రామాల ప్రజలు కోరడంతో, ఆయన స్పందించి అన్ని అనుమతులు మంజూరు చేయడంతో వంతెన పనులు ప్రారంభమైన విషయం విదితమే. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మించారు. నదిపై రెండు అబెట్‌మెంట్ వాల్స్, 9 పిల్లర్లపై వంతెన నిర్మించనున్నారు. ఇప్పటికే మూడు బాక్స్ కల్వర్టులు పూర్తి కాగా, ఒక అబెట్‌మెంట్ వాల్, 3 పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. శుక్రవారం బాలునాయక్ ఈ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శర వేగంగా వంతెన పనులను నిర్వహిస్తున్న కాంట్రాక్టు సంస్థ అసోషియేట్ ఇంజనీర్స్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పీపీ రాజును ఆయన అభినందించారు. అలాగే పిల్లర్ల నిర్మాణం కోసం భూసేకరణలో భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనుల ప్రగతిని ప్రాజెక్ట్ డీఈఈ అన్యం రాంబాబు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ పాండురంగ మూర్తి, ఈఈ కె.చంటిబాబు, టీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.